10లక్షలు విలువ చేసే అమరజీవి కామ్రేడ్ శంకరయ్య స్మారక భవనం ఏర్పాటు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

వార్త మెయిన్‌లో...



విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | **అన్నమయ్య జిల్లా**

శనివారం, 10 మే 2025 8 పేజీలు

- జిల్లా కలెక్టర్

హార్సిలీ హిల్స్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

విశాలాంధ్ర-మదనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రముఖ హార్సిలీ హిల్స్ ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం బికొత్తకోట మండలం హార్సిలీ హిల్స్ పర్యాటక కేంద్రాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుండి అక్కడికి విచ్చేసిన ఒబెరాయ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్, ప్రెసిడెంట్ ఆర్.శంకర్‌లతో కలిసి పర్యాటక అభివృద్ధిపై చర్చించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో ఐదు నక్షత్రాల హెూటల్ ను నిర్మించేందుకు ఒబెరాయ్ సంస్థ ముందుకు వచ్చిన విషయం విదితమే. కొండపై ఐదు నక్షత్రాల హెూటల్ నిర్మాణానికి స్థల కేటాయింపు, నిర్మాణ అవకాశాలు, సాధ్యాసాధ్యాలు తదితరాలను ఈ సందర్భంగా వారు చర్చించారు. అన్నమయ్య జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ అన్ని రకాల వసతులు వారికి ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒబెరాయ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ తో కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే హార్సీ హిల్స్ కొండపై ఉన్న గాలిబండ వద్ద పైభాగాన ఉన్న విఎస్ఆర్ విండ్ వేవ్ హెూటల్ నుంచి వ్యర్థాలను, డ్రైనేజ్ నీరును బయటకు వదలడంతో అవి గాలిబండ సమీపంలో నిలుస్తున్నాయి. దీంతో అక్కడ పారిశుద్ధ్యం లోపించి దుర్వాసనతో పాటు అపరిశుభ్రత నెలకొని పర్యాటకులకు ఇబ్బందికరంగా మారింది. కొండపైన పారిశుద్ధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, సర్వే శాఖ ఏడి భరత్ కుమార్, తాసిల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, పర్యాటక మేనేజర్ సాల్విన్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల సందేశాలు నమ్మొద్దు

విశాలాంధ్ర-రాయచోటి: ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ సైబర్ నేరగాళ్లు పంపుతున్న సందేశాల గురించి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లా ప్రజలను హెచ్చరించారు. బార్డర్ లో ఇండియన్ ఆర్మీ శత్రుదేశ మిసైళ్లను కూలుస్తుంటే సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉద్రిక్త పరిస్థితులను అదునుగా తీసుకొని సైబర్ నేరగాళు కొత్త మోసానికి తెరలేపినట్లు, ఆర్మీ అధికారులం అంటూ సైనికులకు ఆర్థిక సహాయం చేయాలని సందేశాలు పంపుతూ దొరికినంత దోచుకుంటారని, ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు ఎవరూ విరాళాలు అడగరని, ఎవరు కూడా ఎటువంటి లింక్ లను టచ్ చేయవద్దని, అలాగే ఏపీకె ఫైల్స్ ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని నెంబర్లనుండి ఫోన్ కాల్ వచ్చినా, సందేశం వచ్చినా, ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని, ఇలాంటి సందేశాలు నమ్మి, యూపీఐ మాధ్యమాల ద్వారా డబ్బులు పంపించవద్దని జిల్లా ఎస్పీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించండి

- డిపిఓ రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-చెన్నూరు: గ్రామ పంచాయతీకి సంబంధించిన వివిధ రకాల పన్నులను సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజలు తోడ్పాటు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను, నీటి పన్ను తదితర పన్నులను క్యూ ఆర్ కోడ్ ద్వారా చెల్లించినట్లయితే నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అవకాశాలుంటాయన్నారు. కావున ప్రజలు నగదు రూపంలో కాకుండా ఆన్లైన్ ద్వారా పన్నులు చెల్లించాలన్నారు. పంచాయతీ సిబ్బంది పన్నుల వసూలులో అలసత్వం వహించినట్లయితే కఠిన చర్యలు తప్ప ఉన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు చెల్లించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య (కళ్యాణ్) పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి

- రెఫరల్స్‌ను పూర్తిగా నియంత్రించాలి - ఎమ్మెల్యే షాజహాన్ బాష

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్ భాష తెలిపారు శుక్రవారం ఎమ్మెల్యే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిని ఆకర్షణ తనిఖీ చేశారు. నేరుగా వార్డులోకి చేరుకుని చికిత్స పొందుతున్న రోగులను కలుసుకుని అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. రామారావు కాలనీకి చెందిన ఓ మహిళ కడుపునొప్పి బాధ తట్టుకోలేక విషం తాగి ఆస్పత్రిలో చేరి ఐసియూలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించారు. మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆ మహిళతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. ఇంటి స్థలం కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సదుపాయాలు మెరుగ్గా అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నెలకు రూ.30 లక్షల మందులు ఆస్పత్రికి వస్తున్నాయని, అన్ని రకాల జబ్బులకు ఇక్కడే వైద్య చికిత్సలు అందేవిధంగా వైద్యులను నియమిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఇక్కడే చికిత్సలు పొందవచ్చునన్నారు. వైద్యులు సైతం రెఫరల్స్ ను పూర్తిగా నియంత్రిచాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వైద్యులు, వైద్య బృందం, టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాన్పు తల్లీ బిడ్డకు క్షేమం

విశాలాంధ్ర–వాల్మీకిపురం: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం చేసుకుంటే తల్లీబిడ్డకు క్షేమమని మండల వైద్యాధికారి జులేఖబేగం అన్నారు. శుక్రవారం పీహెచ్సి ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణిల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జులేఖబేగం మాట్లాడుతూ గర్భిణిలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంతకు మునుపు సమావేశానికి హాజరైన 32 మంది గర్భిణిలకు ఎత్తు, బరువు, రక్తపోటు, చక్కర, మూత్ర, రక్త పరీక్షలు నిర్వహించి సమస్యలున్న వారికి ముందులను పంపిణీ చేశారు గర్భిణిలు ముఖ్యంగా ఐరన్ ఉన్న ఆహార పదార్థాలైన బెల్లం చెక్కీలు, ఖర్జురం, ఎండుద్రాక్ష, మునగాకు, పచ్చికొబ్బరి గోగాకు తదితర వస్తువులలో ఏదో ఒకటి నిత్యం ఆహారంలో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రులలో సుఖవంతమైన ప్రసవాలు చేసుకునేందుకు అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, గర్భిణిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్రఫి, సిబ్బంది బాబు, సురేష్, కరుణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చు: ఏఓ సుధాకర్

విశాలాంధ్ర–రైల్వేకోడూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చుని మండల వ్యవసాయ అధికారి జి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం 3 లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమికి బలం లబిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పని చేసి వ్యవసాయం చేసే ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని కోరారు. ఎపిఎం పందేటి వసుంధర మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర కీలకం అన్నారు. అందరూ సమన్వయం తో పని చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏరియా కో ఆర్డినేటర్ మల్లిఖార్జునరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది అందరూ కలిసి పని చేసి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడాని అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కాయగూరలు పండ్లు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. ఈ సమావేశంలో మోడల్ మేకర్ కొటం జయమ్మ,మారే చంగల్ రాయులు, సుబ్బరాయుడు,సిసి, యానిమేటర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విఆర్ కళాశాల పూర్వ వైభవంతో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు: నెల్లూరు నగరంలో అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాలను పి–4 విధానంలో భాగంగా దత్తత తీసుకుని, ఆ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం సాయంత్రం మంత్రి నారాయణ వి ఆర్ సి పాఠశాల పునర్నిర్మాణపనులను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల నిరుపేద కుటుంబాలను పి–4 విధానంలో బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సంకల్పం, స్ఫూర్తితో నెల్లూరు నగరంలో అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. నెల్లూరు నగరంలో బంగారు వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు, ఇతర ఉన్నత వర్గాల సహకారంతో ఒక్కొక్క ఉన్నత కుటుంబం ఒక్కొక్క నిరుపేద కుటుంబానికి తోడ్పాటు అందించి, ఆ కుటుంబం సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. తాను కూడా కొన్ని కుటుంబాలను పి4 విధానంలో దత్తత తీసుకుంటానని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ఆర్థికంగా అభివృద్ధి చెంది ప్రథమ స్థానంలో ఉన్న 10 శాతం కుటుంబాలు అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాల అభివృద్ధికి చేయూత ఇవ్వడమే పి–4 ప్రధాన ఉద్దేశంగా మంత్రి వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వి ఆర్ స్కూల్ ను పునః ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ఏడాది జూన్ 12 నుంచి అన్ని వసతులు సమకూర్చి పాఠశాల ను ప్రారంభిస్తామని, తొలి విడతగా నర్సరీ నుంచి 9వ తరగతి వరకు, వచ్చే ఏడాది పదో తరగతి,ఆపై ఇంటర్ వరకుతరగతులుపెంచుకుంటూపోతామని చెప్పారు. నెల్లూరు నగర నడిబొడ్డులో మూడు షిఫ్టుల్లో 8వేలకు పైగా విద్యార్థులు చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం విఆర్సి పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని అనాథలు, పేదలు, నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తిచేసి జూన్ 12 పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో 1000 మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద వదిలిపెడతామన్నారు. విఆర్సి సమీపంలో దగ్గరగా ఉన్న విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా సైకిళ్లు కూడా ఉచి తంగా అందిస్తామని చెప్పారు. ఆ విధంగా వచ్చే విద్యా సంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు. అవసరమైతే 5000 వరకు కూడా విద్యార్థులు చేరేలా అవకాశం కల్పిస్తామ న్నారు. విద్యార్థులఆటపాటలకు అనుకూలంగా గ్రౌండ్ లో ఉన్నటు వంటిపాత శిధిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మిం చాలని ఆదేశించామన్నారు. కాలువ కట్టల మీద ఉండే అనాథలు, నిరు పేదలు, బీడీ కార్మికులు, ఇళ్లల్లో పని చేసుకునే వారి పిల్లలను సుమారు 750మందిని గుర్తించామని, వీరందరికీ కూడా ఈ కళా శాలలో ప్రవేశాలు కల్పించి నిరుపేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తామన్నారు. ఇంకా నిరుపేదల కుటుంబాలు పిల్లలను గుర్తి స్తున్నారని, ఆ కుటుంబాల వివరాలు కూడా పూర్తిగా సేకరిస్తు న్నామని మంత్రి చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా అన్ని వివరాలు సేకరించి నిరుపేద బిడ్డలకు వి ఆర్ స్కూల్లో అడ్మిషన్స్ కల్పిస్తామని, పి–4 విధానంలో ఆ కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా సాయిశ్రీ

విశాలాంధ్ర–వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి మండల వైద్యాధికారిగా సాయిశ్రీ శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ సాయిశ్రీ మాట్లాడుతూ నిత్యం ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే ఎక్కువ ప్రసవాలు అయ్యేవిధంగా దృష్టిసారిస్తామన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండేవిధంగా చర్యలు చేపడుతామన్నారు.

మైనర్ బాలికను కిడ్నప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర–వాల్మీకిపురం: ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ బాలిక కిడ్నప్ కు గురైందని బాలిక తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని టేకలకోన ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ మైనర్ బాలిక మాసం రోజుల క్రితం అదృశ్యమైంది. ఇందుకు సంబంధించి బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కురబలకోట మండలం అంగళ్ల గ్రామం సిద్ధయ్యగారి కోటకు చెందిన రాధాకృష్ణ రెడ్డెమ్మల దంపతుల కుమారుడు జగదీష్ (20) బాలికను కిడ్నప్ చేసినట్లు పోలీసులు గుర్తించి నిందితుడిని అదపులోకి తీసుకుని బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు టీవీఎస్ ఎక్సెల్ ఢీ - వ్యక్తి మృతి

విశాలాంధ్ర–నందలూరు: కడప చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బాహుద నది వంతెన సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, మోపెడ్ (టీవీఎస్ ఎక్స్ఎల్) ఢీకొన్న సంఘటనలో గురునాథం ప్రభుదాస్ (22) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రాజంపేట మండలం బోయిన పల్లె ప్రాంతానికి చెందిన ప్రభుదాస్ నందలూరులోని తమ బంధువుల వద్దకు వచ్చి తిరిగి రాజంపేటకు వెళుతున్న సమయంలో తిరుపతి నుండి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోలేరమ్మకు ఘనంగా బోనాలు

విశాలాంధ్ర–సంబేపల్లె: ఉత్తరాయణ పుణ్యకాలంతో సంక్రాంతి జనవరిలో వస్తుంది. సంక్రాంతి నుండి గ్రామీణ ప్రాంతాలలో జూన్ వరకు జాతర్ల సందడితో గ్రామాలు మారుమోగుతుంటాయి. అమ్మవార్లకు మొక్కుబడి తీరిన భక్తులు చాందిని బండ్ల ఊరేగింపు నిర్వహించి బోనాలు పట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం దుద్యాల గ్రామం పెద్ద జంగంపల్లి గ్రామస్తులు పోలేరమ్మ తల్లికి శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలతో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కుబడిని తీర్చి భక్తిని చాటుకున్నారు. ప్రతి ఏడాది కి ఒకసారి వచ్చే అమ్మవారి జాతర శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనలో భాగంగా మరుసటి దినం పోలేరమ్మకు బోనాలు సమర్పించడం విశేషం పోలేరమ్మ తల్లి చల్లగా చూడాలంటూ అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు, బోనం ప్రసాదంతో నైవేద్యం సమర్పించి భక్తిని చాటుకున్నారు.

నేడు అన్నదానం

విశాలాంధ్ర–ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద శనివారం సంధర్భంగా నేడు 12:30గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

గంగులమ్మకు శ్రద్ధాంజలి ఘటించిన తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి గాండ్ల వీధికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు వేమిరెడ్డి కృష్ణా రెడ్డి మాతృమూర్తి వేమిరెడ్డి గంగులమ్మ వయో భారంతో శుక్రవారం స్వర్గస్థులయ్యారు. గంగులమ్మ భౌతిక కాయానికి రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, అయిచర్ రమణ, వినయ్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. గంగులమ్మ పవిత్రాత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించారు.అనంతరం వారు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-బద్వేలు: మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను బద్వేల్ లో జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటియు సి బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సార్వత్రిక సమ్మె అన్ని రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం ధరలకు అనుగుణంగా 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుకు కూడా కార్మికులకు అరకొరగా మాత్రమే న్యాయం జరిగేవని, ఇప్పుడు 44కార్మిక చట్టాలను రద్దుచేసి 4లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్పొరేటు యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు చేయడంతో కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడతారని హెచ్చరించారు. హైర్ ఫైర్, ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, అప్రెంటిస్ విధానాల ద్వారా కార్మికుల శ్రమ దోపిడీని కార్పొరేట్ యాజమాన్యాలకు దోచిపెట్టేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్నీ కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభలకోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మే 20 సమ్మెలో కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా భారీగా పాల్గొనడం ద్వారా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మే10 వ తేదీ లోపు యాజమాన్యాలకు, అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, మే11వ తేదీన బద్వేల్ విస్తృత సమ్మె సదస్సును, మే15న రౌండ్ టేబుల్ సమావేశం మే17,18 స్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి నాగేంద్ర యూనియన్ అధ్యక్షులు చంచయ్య కోశాధికారి నాగరాజు రెడ్డయ్య శేఖర్ సుధాకర్ వెంకటేష్ హరి సుబ్బు తదితర కార్మికులు పాల్గొన్నారు.

కిశోరీ వికాసమే సమాజ వికాసం

- ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణకుమారి

విశాలాంధ్ర-గాలివీడు: కిశోరీ వికాసమే సమాజ వికాసమని ఐసీడీఎస్ సూపర్వైజర్ వై.అరుణకుమారి పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని పందికుంట, వెలిగళ్ళు గ్రామాల్లో కిశోరీ వికాసం వేసవి సెలవుల శిక్షణా తరగతుల్లో బాల్యవివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కిషోరీ బాలికల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే కిశోరీ వికాసం అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని,బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి బాల్య వివాహ నిషేధ కమిటీలు ప్రతి మొదటి శుక్రవారం, చివరి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసుకొని బాలల సమస్యలపై చర్చించుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ భూదేవి, రమాదేవి, శ్వేత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్

విశాలాంధ్ర-బద్వేలు: మండల పరిధిలోని బయనపల్లి గ్రామంలో ఎం.నాగరాజు ఏడీఏ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయముపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-2025 క్యాంపెయిన్ చేయడం జరిగినది. రైతులతో మీటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో స్లోగన్స్ చదువుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు, స్వయం సహాయక సభ్యులు, పవన్ కుమార్ వీఏఏ, ప్రజా ప్రతినిధులు, బెస్ట్ ఫార్మర్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ హాజరు కావడం జరిగింది.ఈ సందర్భంగా బద్వేల్ వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలనితెలిపారు. తద్వారా భూమి సారవంతం అవుతుంది, ప్రజల ఆరోగ్యం బాగుంటుంది.పెట్టు బడి వ్యయం గణనీయంగా తగ్గి అధిక నికర ఆదాయం పెరుగుతుంది అన్నదాత సుఖీభవ పథక ప్రాధాన్యత, విధి విధానాలు ప్రతి రైతు ఆధార్, పట్టా దార్ పాస్ బుక్ తో సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి అని తెలిపారు. బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 1814మట్టి నమూనాలను సేకరించడం, విశ్లేషణ ఫలితాలు త్వరలో రైతులకు అందించి భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలి అని సూచించడం జరిగింది. బద్వేల్ అర్బన్ రైతు సేవ కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసి అన్నదాత సుఖీభవ రికార్డ్స్ ను, అర్హతల ను పరిశీలించి సదరు రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు బిందురాణికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి అర్హత కలిగిన రైతు ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు ఓబులేసు మృతి

విశాలాంధ్ర-కడప రూరల్: గత ఐదు సంవత్సరాలుగా ఫాతిమా మెడికల్ కాలేజీలో భవన నిర్మాణ కార్మికుడిగా డైలీ వేజ్‌కు ఫాతిమా మెడికల్ కాలేజ్ లో కూలి పనికి వచ్చే ఓబులేసు నేడు ఫాతిమా మెడికల్ కాలేజీ యాజమాన్యం ఆఫీస్ రూమ్ రెండవ అంతస్తు నిర్మాణం పైన ఉన్న లిఫ్ట్‌కు కరెంటు రావడంతో స్పాట్‌లో చనిపోవడం జరిగింది. గత వారం నుండి లిఫ్ట్ కు కరెంటు వస్తున్నది అని కూలీలు యాజమాన్యం తెలియజేసిన పట్టించుకోకపోవడంతో నేడు ఓబులేసు లిఫ్ట్ చైన్ వైరు తాకడంతో కరెంటు షాక్ గురై చనిపోవడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా దళితుడైన ఓబులేసు ఫాతిమా మెడికల్ కళాశాలలో భవన నిర్మాణ కార్మికుడిగా పనులకు వస్తూ ఉన్నాడు. ఇతనికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. బాడుగ ఇంట్లో జీవనం సాగిస్తూ డైలీ పనికి వచ్చే ఇతను చనిపోవడంతో ఓబులేసు కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఫాతిమా మెడికల్ కాలేజ్ నిర్లక్ష్యం వల్ల దళితుడైన ఓబులేసు కరెంటు షాక్‌తో ప్రాణాలు పోవడం జరిగింది. కావున దళితుడైన ఓబులేసు మరణానికి కారణమైన ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకొని బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కే మునేయ్య డిమాండ్ చేశారు. ఫాతిమా మెడికల్ కాలేజీలో చనిపోయిన ఓబులేసు బాడీని పరిశీలించారు.

ప్రజా స్వామ్యంలో కక్ష సాధింపు తగదు: ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర-రాజంపేట: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండే పాత్రికేయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి తెలిపారు. సాక్షి ఎడిటర్ రక్కాసి ధనుంజయ రెడ్డి ఇంటిలో పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం పోలీసులతో తనిఖీలు నిర్వహించడాన్ని నిరసిస్తూ ఐసి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యూజే నాయకులు శుక్రవారం ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే కి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి - ప్రజలకు పాత్రికేయులు వారధిగా ఉంటారన్నారు. అలాంటి పాత్రికేయులను పోలీసులు ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం అంటే ప్రశ్నించే గొంతుకను నొక్కేయడమే అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం, అలాగే ప్రభుత్వ వైఫల్యాల పై సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయ రెడ్డి సాక్షి దినపత్రికలో వార్తా కథనాలను రాయడం ప్రభుత్వానికి నేరంగా కనిపించిందన్నారు. ఇలాంటి విధానాలు ప్రభుత్వ విడనాడాలని డిమాండ్ చేశారు. భయభ్రాంతులతో, సంకెళ్ళతో ప్రజా గొంతుకను నొక్కలనుకోవడం అవివేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు బచ్చోటి భాస్కర్, ప్రతినిధులు మోడపోతుల రామ్మోహన్, తేజం రవిచంద్ర ప్రసాద్, రాయులు, గుర్రంకొండ త్రివిక్రమ్, మద్దికర ఓబిలేసు, తుపాకుల సురేష్, డి నాగేంద్రప్రసాద్, బాలిపోగు సునీల్, మండ్ల శ్రీహరి, చామంచి వెంకటసుబ్బయ్య, చౌడవరం నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఉసురుతీసిన చేపల వేట

విశాలాంధ్ర-లింగాల: చేపలవేట ఉసురు తీసిన సంఘటన వైఎస్సార్ కడప జిల్లా పులి వెందుల నియోజకవర్గం లింగాల మండలం కామసముద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. సత్యసాయి జిల్లా కదిరి మండలం చింతకుంటపల్లి గ్రామానికి చెందిన ఎల్లనూరు హజరతయ్య (69) గత కొన్ని రోజులుగా కామసముద్రం గ్రామంలో బేల్దారి పనులు చేస్తున్నారు. ఇటీవల కూలి డబ్బులు కూడా సదరు మేస్త్రీ చెల్లించాడు. అయితే "రెండు మూడు రోజులు పని లేదు, ఊరికి వెళ్లండి" అని సూచించినట్టు సమాచారం. దీంతో హజరతయ్య శుక్రవారం ఉదయం చేపలు పట్టేందుకు కామసముద్రం చెరువుకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మునిగి మృత్యుకుహరంలోకి జారుకున్నాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

భవన నిర్మాణానికి దాతలు సహకరించాలి

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నూతన భవన నిర్మాణానికి దాతలు సహకరించాలని సంస్థ అధ్యక్షుడు రాజు విజ్ఞప్తిచేశారు. నిర్మాణదశలో ఉన్న స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా సామాజిక సేవలను మరింత విస్తృత పరిచేందుకు కొంత మంది సలహా సూచనల మేరకు భవన నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు స్థలం కూడా ఉచితంగా ఇచ్చారన్నారు. ఆ స్థలంలో దాతల సహాయ సహకారాలతో పునాదులు పూర్తయ్యాయని, కరెంటు, తాగు నీటి మోటారు సమకూర్చామన్నారు. ఆ తర్వాత ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురుకావడంతో భవన నిర్మాణం ఆగిపోయిందన్నారు. భవన సముదాయం ఉంటే మరిన్ని విశిష్ట సేవల అందించేందుకు వీలుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో దాతలు మరింత ఆర్థిక సాయం అందించాలని తాను కోరుకుంటున్నానన్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువులు జరుపుకునే వివాహాలు, పుట్టినరోజు లాంటి శుభ కార్యాలు గాని వర్ధంతి జ్ఞాపకార్థాలు గాని, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక లాంటి సమావేశాలు , సంఘాలు, అసోసియేషన్ లు, యూనియన్ లు ఏ కార్యక్రమాలు అయినా వాటి సందర్భంగా కూడా విరాళాలు అందజేసి భవన నిర్మాణం లో భాగస్వాములు అవ్వాలి అని అలాగే ఎవరైతే 20 వేల రూపాయిలు లేదా ఆ పై విరాళాలు అందజేసే వారి పేర్లు శాశ్వత శిలాఫలకం పై లిఖించబడును అలాగే పన్ను రాయితీ వెసులుబాటు కూడా అందని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా దాతలు స్పందించి విశిష్ట మరియు విస్తృత సేవలు అందించేందుకు భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు సహృదయం తో స్పందించాలని, వివరాలకు 9966509364 దాతలు సంప్రదించాలని ఆయన కోరారు.

భారత సైనికులు క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-వేంపల్లి: భారత సైనికులు క్షేమంగా ఉండాలని పెండ్లిమర్రి మండలం నంది మండలం సమీపంలోని కొండ గంగమ్మ తల్లికి శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు మహబూబ్ బాషా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లో పహల్గామ్ దాడి జరిగిన సరిగ్గా 15రోజుల తర్వాత భారతదేశం ప్రతీకారం తీర్చుకుందన్నారు.. తెల్లవారు జామున 1:44 గంటల ప్రాంతంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌లో పేరుతో పాకిస్తాన్, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని, పహల్గామ్ ఉగ్రదాడికి సమాధానంగా జరిగిన ఆపరేషన్ సిందూర్ మన దేశ శక్తి సామర్థ్యాలను, మన సైన్యం పరాక్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారత సైన్యం మెరుపు దాడులు నిర్వహించి ఉగ్రవాదుల అంతమే భారతలక్ష్యమని తెలియజేసిందన్నారు. ఈ ఆపరేషన్ సిందూర్ లో భారత సైనికులు క్షేమంగా ఉండాలని. మరింత శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని తన కుమార్తె అర్పామహియా నేతృత్వంలో కొండ గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో శివ, నాగేంద్ర, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. ముద్దనూరు, కడప రోడ్డు, వేంపల్లె రోడ్డు, రాణివనం, వినాయకనగర్, సుందరయ్య నగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో కలుగు అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన వినతి చేశారు. ఈ సమయంలో కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయడం, తీగల మధ్య ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

ఫారం పాండ్లు కాలువ పూడిక పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-రామాపురం: ఉపాధి పనుల్లో చేయబడిన ఫారం పాండ్లు కాలువ పూడికి పనులు మే నెల చివరి నాటికి పూర్తి చేయాలని డ్వామా పిడి వెంకటరత్నం ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించి ఉపాధి పనుల్లో చేపట్టిన రెండు ఫారం పండ్లు కాలువ పూడికోనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ కూలీలకు గిట్టుబాటు కూలి 307రూపాయలు పడేవిధంగా పనులు కల్పించాలన్నారు. కూలీలను పెంచిమే నెల చివరి నాటికీ టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఏపీవో పెంచలయ్య టిఏ చంద్రశేఖర్ ఫీల్డ్ అసిస్టెంట్లు మసూద్, రవిశంకర్‌రెడ్డి, పక్కిర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర-వేంపల్లి: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించినట్లు డిఇ వెంకట నాగేంద్ర తెలిపారు. గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో రెండు పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు. దీంతో వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధించి యథావిధిగా విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించినట్లు చెప్పారు. విద్యుత్‌ను సకాలంలో అందించినందుకు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ లు అభినందించారు. ఆర్కేవ్యాలీ క్యాంపస్ లో ఉన్న పియుసి 1 విద్యార్థులకు సెమిస్టర్ - 2 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి విద్యుత్ సమస్యలతో ఇతర సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఎప్పుడుకప్పుడు త్రిబుల్ ఐటీ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రూ.10కోట్ల పనులకు ప్రతిపాదనలు!

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు రూ. 10కోట్ల అంచనా వ్యయంతో అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సూచన మేరకు మున్సిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆమేరకు నివేదించారు. ఈ ప్రతిపాదనలను ఆమోదం కోసం కౌన్సిల్ ముందు ఉంచనున్నారు. స్థానిక కడప రోడ్డులోని క్రాంతినగర్ ద్వారా వేంపల్లి రోడ్డును అనుసంధానిస్తూ ప్రధాన మురుగుకాలువలను దొండపాడు మీదుగా వంక వరకు రూ. 5కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. అలాగే

పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు,

- రూ.7కోట్లు ఎన్‌హెచ్ నిధులతో మురుగుకాలువలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది సూచనలతో చర్యలు వేగవంతం
- మారనున్న ఎర్రగుంట్ల భౌగోళిక స్వరూపం
- నిధుల మంజూరులో నిమగ్నమైన చదిపిరాళ్ల

మురుగుకాలువల కోసం రూ. 2కోట్లు వెచ్చించనున్నారు. అలాగే పలు చోట్ల రూ. 44లక్షల వ్యయంతో నీటి సరఫరా పైపులైన్లు మార్చనున్నారు. విద్యుత్ స్థంభాలు, లైన్ల ఏర్పాటు, వాటికి వీధి దీపాల అమరికకు రూ. 47లక్షలు వెచ్చించనున్నారు. మైలవరం దక్షిణ కాలువ వెంబడి సుందరయ్య నగర్‌కు వెళ్లే దారిలో డివైడర్లు, వీధి దీపాల ఏర్పాటుకు రూ. 77 లక్షలు ఖర్చుచేయనున్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 17లక్షలు అవసరమని అంచనా వేశారు. అలాగే పారిశుధ్య నిర్వహణకు అవసరమైన రెండు వాహనాల కొనుగోలుకు రూ. 20లక్షలు వెచ్చించనున్నారు.

రూ.7కోట్లు ఎన్‌హెచ్ నిధులతో కాలువలు

పురపాలిక పరిధి నాలుగు రోడ్ల కూడలి నుండి కడప రోడ్డులో ఇరువైపులా మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ పనులను కడప రోడ్డుతో పాటు వేంపల్లె రోడ్డులో కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఆ మేరకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జాతీయ రహదారుల ఉన్నతాధికారులతో నిధుల మంజూరుకు చర్చించిన నేపథ్యంలో రూ. 7కోట్లతోపనులు సాధ్యం కానున్నాయి. ఈ పనులు పూర్తి కావడం ద్వారా ఎర్రగుంట్ల భౌగోళిక స్వరూపం మారుతుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎమ్మెల్యే ఆది నిరంతరం అధికారులతో చర్చిస్తూ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించడంతో పాటు వాటి ఏర్పాటుకు అవసరమయ్యే నిధులను మంజూరు చేయించే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

పత్రికారంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

విశాలాంధ్ర-వేంపల్లి: పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని పాత్రికేయులు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు హెూదాలు చేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటువంటి ముందస్తు నోటీసులు లేకుండా సోదాలు చేయడానికి వెదసిస్తూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ హరినాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంపై విజయవాడ నగర సెంట్రల్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి సెర్చ్ చేయడాన్ని ఇది పత్రికా స్వేచ్ఛకు పూర్తి స్థాయి విఘాతంగా భావిస్తున్నామన్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికారంగంపై దాడిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇవేదాడులు, ఇవే ఆంక్షలు, ఇలాంటి బెదిరింపులు కొనసాగే పరిస్థితిని ప్రభుత్వం తీసుకురావడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం అయిన మీడియా పరిరక్షణకు పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి. అవినీతి వార్తలు రాస్తే ఎడిటర్ కుటుంబాన్ని భయ భ్రాంతులకు గురి చేసేలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నామన్నారు. .ప్రభుత్వ పెద్దలకు సాక్షి యాజమాన్యంపై ఉన్న రాజకీయ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు జర్నలిస్టులపై ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు భావించాల్సి వస్తున్నది. సాక్షి పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం, సంపాదకుని ఇంట లో సోదాలు చేయడం పాత్రికేయులను భయ భ్రాంతులకు గురి చేయడానికేనని మేం భావిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, ఏపీడబ్ల్యూజే ఎఫ్, తెలుగు యూనియన్ జర్నలిస్టు ఫోరం జర్నలిస్టులు పాల్గొన్నారు.

చిన్న వయసులోనే గర్భవతి కావడం తల్లి బిడ్డకు ఆరోగ్య రీత్యా మంచిది కాదు

విశాలాంధ్ర-రామాపురం: చిన్న వయసులోనే బాల్య వివాహాలు చేయడం వల్ల చిన్న వయసులోనే గర్భవతి కావడం తల్లి బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని రామపురం ఐసిడిఎస్ సూపర్వైజర్లు హుస్సేనమ్మ, పద్మజారాణి, సుజాత రెడ్డి, సరస్వతి పల్లి, జిఎంకేఎస్ మౌనిక అన్నారు. మండలంలోని రామాపురం సెక్టర్ హసనాపురం పంచాయతీ ఎరింగివాండ్లపల్లి అంగన్వాడి కేంద్రంలో సరస్వతి పల్లి గువ్వలచెరువు సెక్టార్ గోపగుడిపల్లి చిట్లూరు సెక్టార్ చిట్లూరు దళితవాడలో శుక్రవారం కిషోర్ బాలికల వికాసం సమ్మర్ కోచింగ్ లో భాగంగా బాల్య వివాహాలు మూఢనమ్మకాలు పునర్పత్తి ఆరోగ్యం అనే అంశాలపై 14 నుండి18 వయసు గల కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మూఢనమ్మకాలతో చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం జరుగుతుందని దానివల్ల ఆడపిల్లలకు రక్తహీనత వల్ల పాలవుతారని దీనివల్ల పుట్టబోయే బిడ్డ తల్లి అనారోగ్య పాలవుతారు అన్నారు. గ్రామాలలో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులకు ఐసిడిఎస్ అధికారులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. కిషోర్ బాలికలు చిన్న వయసులోనే లక్ష్యాలను నిర్ధారించుకొని ఉన్నత చదువులు చదువుకొని లక్ష్యాలు వైపు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ నగజ, ఏఎన్ఎం హైమావతి, అంగన్వాడి కార్యకర్తలు మాధవి, ఝాన్సీ, శిరీష, అమృతవల్లి పాల్గొన్నారు.

రిమ్స్ ప్రిన్సిపల్‌ను కలిసిన గైనకాలజీ వైద్య బృందం

- ఆప్కాస్ ఉద్యోగులు ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కడప: కడప నగర శివార్లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ గా ఈనెల 8న బాధ్యతలను చేపట్టిన డాక్టర్ టి. జమున చాంబర్లో శుక్రవారం గైనకాలజీ విభాగం విభాగాధిపతి లక్ష్మీ సుశీల తో పాటు వైద్య బృందం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ రేఖరావు, డాక్టర్ నీలిమ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ సోఫియా సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కడప రిమ్స్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నుంచి నాయకులు వెంకటసుబ్బయ్య, బాలాజీ రావు, ఏసన్న, నాగేంద్ర, పవన్ తదితరులు విచ్చేసి ప్రిన్సిపాల్ డాక్టర్ జమునకు మొక్కలు అందజేశారు. కడప రిమ్స్ వైద్య కళాశాలలో ఆసుపత్రిలో కార్మికుల సమస్యలను వివరించారు. హెచ్ఒడిలు పరిపాలన సిబ్బం దితో ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా సమీక్ష...కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత డాక్టర్ జమున తన కాన్ఫరెన్స్ హాల్లో అన్ని విభాగాల హెచ్వోడీలు, వైద్యులతో, కళాశాల పరిపాల విభాగం అధికారులు, సిబ్బందితో ప్రత్యేకం గా సమీక్ష నిర్వహించారు. ఎవరైనా ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.

భారత సైనికులకి మద్దతుగా నేడు ర్యాలీ

విశాలాంధ్ర-నందలూరు: మన భారతదేశం ఆపరేషన్ సింధూర్ మొదలు పెట్టిన సందర్భంగా మన దేశానికి, మన సైనికులకి మద్దతుగా శనివారం సాయంత్రం 4.30 గంటలకు అరవపల్లి కృష్ణ మందిరం దగ్గర నుండి అంబేద్కర్ సర్కిల్ బస్టాండ్ వరకు మన దేశ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలు, పార్టీలకు అతీతంగా చిన్న, పెద్ద, ముసలి, ముతక ప్రతి ఒక్కరు మన దేశానికి, సైనికులకు మద్దతుగా వచ్చి మన దేశానికి దేశ సైనికులకి జేజేలు పలకాలని కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, అమ్మవారి శాల ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహ, మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, నారపు శెట్టి శివయ్య, సురేష్, సుబ్బ నరసయ్య, గురువి గారి వాసు, కొట్టే శ్రీహరి, ఆదినారాయణ, వైసీపీ నాయకులు బూసి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాకి చంద్ర, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కభజన కళాకారుడికి ప్రశంస పత్రం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన" మన పల్లె జానపదం జాతర" అనే కార్యక్రమంలో పోరుమామిళ్ల పట్టణానికి చెందిన చెక్కభజన కోలాటం కళాకారుడు చిత్తూరి ఎల్లయ్యకు ప్రజా కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జయపాల్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి సన్మానించారు.. మరుగున పడుతున్న మన పల్లె పాటలను వెలికి తీయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రశంసా అందుకున్న ఎల్లయ్యను పలువురు అభినందించారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మంగారి 332గురుపూజ మహోత్సవం

- మహా ప్రసాద నైవేద్యంతో ముగింపు
- అంగరంగ వైభవంగా పోలేరమ్మ ఆలయంలో రథోత్సవం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయంలో 332వ గురుపూజ మహోత్స వం ఈనెల 4 నుండి ఘనంగా ప్రారంభమై అందులో భాగంగానే ప్రతిరోజు ఉదయం తెల్లవారుజాము నుండి బ్రహ్మంగారి సుప్రభాత సేవలు నామ సంకీర్తన అభిషేకాలు సహస్ర నామార్చన ఆలయ ఉత్సవాలు హరి కథలు కాలక్షేపం సాంస్కృతి కార్యక్రమాలు ఉపన్యాసాలు పండితుల అర్చకులు మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ పర్యవేక్షణలో దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆధ్వర్యంలో వివిధ రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాట్లను దర్శనానికి వెళ్లే భక్తులకు భారీ క్యూ లైన్ లో వేసవి నిఢద్దేశించి ఎయిర్ కూలర్స్ మజ్జిగ మంచినీళ్ల ఏర్పాట్లు తో పాటు మహిళలకు పురుషులకు వేరు వేరు స్నానపు గదులు, చలువ పందిళ్లు ఆలయ ప్రాంగణాల్లో అలంకరణ విద్యుత్ దీపాలు ప్రత్యేక వసతులను కల్పించారు. అందులో భాగంగానే శుక్రవారం ఉదయం బ్రహ్మంగారి సుప్రభాత సేవలు, నామార్చన సంకీర్తన గుడి ఉత్సవం మధ్యాహ్నం మహాప్రసాద వినియోగంతో ఉత్సవాలను ముగించారు. అందులో భాగంగానే బ్రహ్మం గారి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయంలో రథోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దివంగత మఠాధిపతులు కుమారులు వెంకటాద్రి దేవస్థానం అధికారులు అమ్మవారికి చీర, సారె, పసుపు కుంకుమ బ్రహ్మంగారి ఆలయం నుండి పోలేరమ్మ గుడి వరకు మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారికి ఆలయంలో అందజేశారు. సిబ్బంది భక్తులు ఆలయ అర్చకులు వేద పండితులు తదితరులు పాల్గొని రథోత్సవం విజయవంతం చేశారు.

ఆలయానికి రూ.110000 గ్రానైట్

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ మారమ్మ తల్లి ఆలయానికి 110000/-(ఒక లక్ష పది వేలు) రూపాయలు విలువచేసే గ్రానైట్ బండలను రాయల్ మెడికల్స్, మీసేవ అధినేతలు అరిగే మని, అరిగే హరిబాబులు వారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు తమను సంప్రదించగా 13చదరాల గ్రానైట్ బండలను కొనుగోలు చేసి ఆలయం వద్దకు తరలించామని అన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గారెడ్డి, మేస్త్రి నారాయణ, అది వెంకటేష్, ఆంజనేయులు, సుబ్బనరసయ్య, కుంభగిరి గోపాల్ పాల్గొన్నారు.

నేడు చిన్నగంగమ్మ తల్లి తిరుణాల

విశాలాంధ్ర-సుండుపల్లె: వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లి గ్రామంలో నేడు శనివారం ఉదయం శ్రీ చిన్న గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు హోమాలు పుట్టమొను తేవడం మహా మంగళహారతి నిర్వహిస్తున్నట్లు జాతర నిర్వాహకులు ముద్దలూరు రామకృష్ణం రాజు తెలిపారు. రాత్రికి చాందినీ బండ్ల ఊరేగింపు, తొగటపల్లి నుంచి శ్రీ చౌడేశ్వరి దేవి, జ్యోతులను ఊరేగింపుగా జాతరకు తీసుకొస్తారు. తెల్లవారుజామున భక్తులు బోనాలు పట్టి అమ్మవారికి సమర్పిస్తారు.

గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం

- రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర-సుండుపల్లె: వీరబల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9 మరియు 10 తేదీలలో జరుగు పీఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేయుచున్న గర్భిణీ మహిళలకు గత మూడు సంవత్సరాలు లాగే ఈ నెల కూడా అన్నదానం చేసిన రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సేవాభావంతో చేస్తున్న అందరూ ఆదరించాలని సహాయ సహకారాలు అందించాలని గర్భిణీ మహిళలకు సేవ చేయడం మండల మొదటి పౌరుడిగా నా వంతు బాధ్యతగా నేను చేస్తున్నానని దీనిని గుర్తు పెట్టుకొని ప్రతి ఒక్క గర్భిణీ మహిళ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొని వస్తే సత్వరం పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పలువురు గర్భిణీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తులు సమర్పించుకున్న కానుకలు హుండీలు లెక్కించగా వచ్చిన ఆదాయం 47,26627 రూపాయలు. ఏడు హుండీలు రెండు నెలలు కాలంలో హుండీలను భక్తుల మధ్య దేవదాయ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ అధికారులు కలిసి లెక్కించడంతో 4726627 వచ్చినట్లుగా ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ పర్యవేక్షణలో లెక్కించినట్లుగా తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం ఆలయ మేనేజర్, ఈశ్వరయ్య ఆచారి పరిధిలో జిల్లా దేవదాయ శాఖ అధికారులు దిగవంత మఠాధిపతులు, కుమారులు, వెంకటాద్రి స్వామి భద్రయ్య స్వామి వీరభట్లమయ్య దత్తాత్రేయ స్వామి దివంగత మఠాధిపతులు రెండో భార్య మారుతి మహాలక్ష్మి కుమారులు గోవింద స్వామి దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ శివయ్య, వారి సిబ్బంది ఏపీ జీబి బ్యాంక్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మడితాడు అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలికల వికాసం

విశాలాంధ్ర-సుండుపల్లె: మడితాడు సెక్టార్ మడితాడు అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వనజమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం -వేసవి సెలవుల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేయాలి. అంతకన్న ముందు చేస్తే అది బాల్యవివాహం అవుతుందన్నారు. అది చట్టం దృష్టిలో నేరం అవుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

వైవీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు కువెంపు యూనివర్సిటీ ప్రశంసలు

విశాలాంధ్ర-కడప వైవీయూ: కర్ణాటకలోని కువెంపు యూనివర్సిటీ ఈ నెల 3 నుంచి 9వ తేది వరకు నిర్వహించిన నేషనల్ ఇంట 'గ్రేషన్ క్యాంప్లో వై వియు విద్యార్థులు రాణించారు. పలు రాష్ట్రాల నుంచి 100 మంది విద్యార్థులు హాజరైన ఈ క్యాంపు లోయోగి వేమన విశ్వవిద్యాలయం వాలం టీర్లు ప్రతిభ చూపారు. వైవియు ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో వైవీయూ క్యాంపస్ కళా శాల నుంచి 5 మంది, వైయస్సార్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ నుండి ఇద్దరు, ఎస్కేఆర్ఎస్ కే ఆర్ ఉమెన్స్ కాలేజ్ నుంచి ఇద్దరు వాలం టీర్లు, వీరితోపాటు ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు కంటిజెంట్ లీడర్గా రాష్ట్రము తరుపున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాలం టీర్స్ రాష్ట్ర సంస్కృతి, యోగి వేమన యూనివర్సిటీ వైభవాన్ని, వివిధ పాటల, ఆటలు, నాటకము, నృత్యం, కల్చరల్ ప్రోగ్రామ్స్ల రూపములో వివిధ రాష్ట్రము లనుండి వచ్చిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు పరిచయం చేశారు.ఈ కార్యక్రమం ప్రతిభ కనబరిచిన ఈశ్వర్, సిరి చందన కి బెస్ట్ వాలంటీర్ అవార్డు పొందారు. వీరితో పాటు డా. కె. శ్రీనివాస రావు, యూనిట్ -9 ప్రోగ్రాము ఆఫీసర్ కి బెస్ట్ ప్రోగ్రాము ఆఫీసర్ గా కువెంపు యూనివర్సిటీ నుంచి అవార్డుతో పాటు సత్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత యోగ, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు పరిచయం చేశారు. అవార్డు పొందిన వారిని వై.వి. యుస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వెంకట రామిరెడ్డి అభినందనలు తెలిపారు.

సర్పంచ్ చొరవతో విధుల్లోకి చేరిన కార్మికులు

విశాలాంధ్ర-వేంపల్లి: పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి గత 5 నెలలుగా జీతాలు రాక పోవడంతో విధుల్లోకి వెళ్లకుండా రెండు రోజులైనా శుక్రవారం పంచాయతీ సిబ్బంది ధర్నా చేపట్టారు. దీంతో సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి జీతాలు విషయంపై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డితో చర్చించి జీతాలు మంజూరు చేయాలని కోరడంతో జీతాలు మంజూరుకు ఇఓ రామసుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ధర్నా చేస్తున్న పంచాయతీ సిబ్బందితో కూడ సర్పంచ్ శ్రీనివాసులు చర్చించి అందరికి జీతాలు మంజూరు అయ్యేందుకు కృషి చేస్తామని ధర్నాను విరమించి విధులకు హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఇచ్చిన హామీ మేరకు విధుల్లోకి చేరి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం ఒక్కొరికి రూ. 10 వేలు చొప్పున చెల్లింపులు చెల్లిస్తామని ఇఓ హామీ ఇచ్చినట్లు చెప్పారు. గ్రామపంచాయతీలో రూ 16 లక్షలు ఉన్నాయని వాటిని సిబ్బంది జీతాలు కోసం ఉపయోగిస్తామని ఇఓ చెప్పినట్లు వారు చెప్పారు. ముందు జీతాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ఇఓను కోరడంతో ఆయన కూడ స్పదించినట్లు చెప్పారు. అలాగే ఈనెలాఖరుకు మార్కెట్ టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో సిబ్బందికి మొత్తం జీతాలు చెల్లిస్తామని కార్మికులకు ఇఓ హామీ ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్టర్లుకు బిల్లులు ఇవ్వాల్సిన అవసరం లేదని ముందు కార్మికుల జీతాలకు, తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు ఖర్చు పెట్టాలని ఇఓను కోరినట్లు చెప్పారు. ఇఓ హామీ మేరకు సిబ్బందితో ధర్నాను విరమించి విధులకు హాజరు అయ్యేలాగా చేసినట్లు చెప్పారు. తమ హామీని ఒప్పుకొని ధర్నాను విరమించిన కార్మికులకు, ఇఓకు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించి చెత్త సేకరణను క్రమబద్ధీకరించండి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల పట్టణం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో, కుక్కల బెడద విపరీతంగా ఉందని తరచూ దాని కారణంగా పిల్లలు, పెద్దలు కూడా కుక్క కాటుకు గురవుతున్నారని దీనిపైన తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్వర్ పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ అధికారి రవి శంకర్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ! పంచాయతీ పరిధిలో తరచూ వీధి కుక్కలు పగలు రాత్రి తేడా లేకుండా స్వైర విహారం చేస్తూ, పిల్లలు మరియు పెద్దలందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, ఎక్కువగా ఈ వేసవి కాలంలో చిన్నపిల్లలు సాయంత్రం పూట ఆరుబయట, వీధులలో ఆడుకుంటున్నట్లు వంటి సందర్భాల్లో కుక్కకాటు గురవుతున్నారని, వీటిపైన తగు చర్యలు తీసుకొని వీటిని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతూ! అలాగే చెత్త సేకరణ కూడా ప్రతి దినం పంచాయతీ పరిధిలోని అన్ని వీధులలో సేకరించాలని ఆయన ఈవో కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పౌరులు పీరా,షరీఫ్, భాష తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీ పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఏపీ యన్‌జివో నాయకులు

విశాలాంధ్ర-కడప: కడప రీజనల్ డైరెక్టర్ గా వచ్చిన డాక్టర్ బి. రామగిడ్డయ్య ను కలిసిన కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, మాధవ్, కడప జిల్లా కార్యదర్శి,డి రవి కుమార్, అనంతపురం కార్యదర్శి డి చంద్రమోహన్, జిల్లా మహిళ కన్వీనర్ జమీలా, కోశాధికారి ప్రవీణ్ కుమార్ కలిసి వైద్య ఆరోగ్య శాఖ లో 30 సంవత్సరాల నుండి ఏయన్ఎంగా పనిచేస్తున్న ఇంతవరకు

పదోన్నతులు కల్పించలేదు. ఇప్పుడు రీజియన్ పరిధి లోని అన్ని సూపర్వైజర్ ఫిమేల్ ఖాలిల ను వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని మరియు కడప రీజియన్ పరిధిలోని అన్ని క్యాడర్స్ ఫార్మసీ ఆఫీసర్స్, పియచ్ఎన్, ఎల్టి పదోన్నతలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆర్డి డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ త్వరలో సీనియార్టీ రడీ చేసి ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, కడప ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈనెల 12న హరిహరాదుల తిరుణాల

విశాలాంధ్ర-సుండుపల్లె: వీరబల్లి, అతి పురాతనమైన దేవాలయాల్లో ఒకటైన వీరబల్లి హరిహరాదుల దేవస్థానంలో ఈనెల 12న సోమవారం ఘనంగా జాతర నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు తిరుణాల మహోత్సవ పాంప్లెట్ ను విడుదల చేశారు. ఈ తిరుణాల మహోత్సవాలలో భాగంగా ఈ నెల 11న ఆదివారం సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, అంకురార్పణ, కలశపూజ, హోమా లు జరుగుతాయని అలాగే 12వ తేదీ ఉదయం 5గంటల40 నిమిషాలకు సుప్ర భాత సేవ, 6గంటలకు గణపతి పూజ, దేవతామూర్తులకు అభిషేకములు,అర్చనలు 8.30 గంటలకు ధ్వజారోహణం, 9 గంటలకు గణపతి హోమం, రుద్రాభి హోమం, శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, మన్యుసూక్త హోమం, సుదర్శన హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి, కలిసోద్వాస న జరుగును. ఉదయం 11 గంటలకు శ్రీ శివపార్వతుల మరియు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్ల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు అన్నప్రసాద వితరణ, రాత్రి 8గంటల నుండి శ్రీ హరి హరాదుల రథోత్సవం అలాగే ఉమామ హేశ్వరి ఈవెంట్స్ ఒంగోలు వారిచే బృందా వనం శివపార్వతుల కళ్యాణం మొదలగు ప్రదర్శనలతో ఘనంగా జాతర నిర్వహించబడునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.కావున ఈ కార్యక్రమానికి ప్రజలు విషయంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు తెలియజేశారు.

కిషోర్ వికాస్‌పై అవగాహన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని టీబీ రోడ్డులో గల శాస్త్రీ నగర్ నందు రజక వాడ అంగన్వాడి సెంటర్ నందు కిషోర్ వికాసము వేసవి శిక్షణ కార్యక్రమంను మ హిళా పోలీస్ యామిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి మాట్లాడుతూ రుతుక్రమము, పరిశుభ్రత గు రించి అదేవిధంగా రుతుక్రమ సమయంలో పరిశుభ్రమైన న్యాప్కిన్లు వాడాలని, లింగ వివక్షత, రక్తహీనత, పౌష్టికాహారం, పిసిపి ఎన్‌డిటీ యాక్ట్ అక్ట్, వివాహ వయస్సు 21సంవత్సరం అమ్మాయికి, అబ్బాయికి 25 సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలని తెలి పారు. బాల్య వివాహాలు చేసుకోకూడదని, చిన్న వయసులో వివాహం చేసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలు గురించి, ఉన్నతమైన చదువులు చదువుకోవాలని తెలి పారు. మహిళా పోలీస్ యామిని మాట్లాడు తూ అమ్మాయిల భద్రత కోసం శక్తి యాప్ గురించి తెలిపారు. గంగాభవాని, రమణమ్మ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మానవ సేవే - మాధవ సేవ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కొత్తూరు నరసరా మయ్య, గంగాదేవిల కుమారుడు సాహిత్ కుమార్ 8వ పుట్టినరోజు సందర్భంగా అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ మరియు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణం లోని మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వికసిత ఫౌండేషన్ చైర్మెన్ శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ మన ముఖ్యమైన దినాలను సేవామార్గంలో జరుపు కోవడం వల్ల మనం ఎంతో ఉన్నత స్థాయికి వెళ్తామని యువతీ, యువకులు తమ పుట్టిన రోజును, ఇతర ముఖ్య దినాలను సేవా మార్గంలో జరుపుకోవాలని అన్నారు. ఇలాంటి

గొప్ప సేవా కార్యక్రమాలను సమాజానికి అందిస్తున్న అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వ్యవస్థాపకుడు పెరుగు భాస్కర్ మరియు సంస్థ సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అరవింద్, అశోక్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం బాధాకరం: ఎమ్మెల్యే ఆకెపాటి

విశాలాంధ్ర-రాజంపేట: జమ్ము కాశ్మీర్లో తెలుగు జవాన్ మురళి నాయక్ వీరమరణం బాధాకరమని రాజంపేట శాసనసభ్యులు, వైయస్సార్సీపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మురళీనాయక్ స్వస్థ లం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియో జకవర్గం, కళ్ళి తండా గ్రామం, మురళీనా యక్ వీరమరణంపై ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభద్ర తలో తన ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమ రణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేం అని తెలిపారు. మురళీ నాయక్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపా రు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశభద్రతలో తన ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమన్నారు.

30మంది గర్భవతులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని టీబీ రోడ్లులో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృ త్వ అభియాన్ కార్యక్రమంను వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు, డాక్టర్ వి.అనూషల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష పాల్గొని 30మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భవతులు తీసుకోవాల్సిన

జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఒఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతులు ఉద్యోగ అవకాశాన్ని ఉపయోగించుకోగలరు

విశాలాంధ్ర-వేముల: వేముల స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ పులివెందుల లో ట్రైనీ టైలర్ ఉద్యోగ ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం పేదరిక నిర్మూలనకు వెలుగు డిఆర్‌డిపి ద్వారా కల్పించే శిక్షణ ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని,ప్రతిభ కు పేదరికం అడ్డు కాదని మహిళలు పట్టుదలతో మహిళా సాధికారత వైపు అడుగులు వేయాలని సూచించారు.ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్వ్యూలకు హాజరైన మహిళలకు సూచించారు. ఈ సందర్భంగా సి డాప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ సి డాప్ ద్వారా శిక్షణ మరియు ఉపాధి మార్గాలు అన్వేషణ చేయడం గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి పెంచడం, స్కిల్స్ నేర్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ హెచ్ఆర్ ఎక్సిక్యూటివ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైనటువంటి 23 మంది మహిళలకు ట్రైనీ టైలర్లుగా కంపెనీ ద్వారా సమాచారం అందుతుందని సోమవారం నుండి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు హరికృష్ణ గంగ రాజు జాబ్స్ కోఆర్డినేటర్ మల్లీశ్వరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపెయిన్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: మండల పరిధి లోని కోనంపేట గ్రామ సచివాలయం నం దు శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాం పెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ బాలికలకు 18సంవత్సరాల వయసు నిం డిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. అలాగే ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు బాలికల దగ్గరికి వచ్చి టచ్ చేయడానికి ప్రయత్నిస్తే గట్టిగా అరవడం కానీ అక్కడి నుంచి పరిగెత్తి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాల పట్ల కలిగే దుష్ప్రభావాలు గురించి బాలికల తల్లులకు వివరించారు. అనంతరం బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మావతి, సిపిఓ వెంకట రవికుమార్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, సూపర్వైజర్లు లక్ష్మీదేవి, తులసమ్మ, అంగన్వాడీ కార్యక ర్తలు అనిషా, నాగమణి , విమల, లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాజుపాళెం మండలంలో వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సంజీవరాయ స్వామి, శ్రీ భీమలింగేశ్వర స్వామిల వార్షిక బ్రహ్మోత్సవాలలో దేవస్థానం కమిటీ వారి ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపల్లె నారాయణ రెడ్డి, పగిడాల రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అన్యాయం జరుగుతుంది

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: దేశంలో ఇటు రాష్ట్రంలో క్రైస్తవులకు అన్యాయం జరుగుతుందని వైయస్సార్సీపి సోషల్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఎక్కడో ఒక చర్చ్ ఫాదర్ కు ఎస్ సి, ఎస్టీ వర్తించదు అని ఇచ్చిన తీర్పును దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులకు ముడి పెట్టడం సరికాదని అన్నారు. గౌరవ సుప్రీం కోర్ట్‌లో 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా వారికి నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చు అన్నదానిని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడా ఒక దళితుడై ఉండి బౌద్ధ మతాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో దళితులపై దళిత క్రైస్తవులపై సవితి ప్రేమ చంద్రబాబు నాయుడు చూపిస్తున్నారని

అన్నారు. భారతదేశ రాజ్యాంగంలో పొందుపరిచినట్టు ఏ కులం వారైనా ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చునన్న దానిని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది పాస్టర్లు ఉన్నారని కేవలం 7000 మందికి మాత్రమే గౌరవ వేతనం ఇస్తున్నారని అందరికీ గౌరవ వేతనం అందించే విధంగా పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని క్రైస్తవ పాస్టర్లను అందరినీ ఒక్క తాటి మీదికి తీసుకువచ్చి రాబోయే రోజుల్లో ఉద్యమం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి పాస్టర్ జాన్, త్యాగరాజు, కనుపాటి బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్ తెల్లవారుజామున 3 గంటలకు జమ్మూ కాశ్మీర్ లో పాకిస్తాన్ కు చెందిన 5 మంది సైన్యాన్ని అంతం అందించి మన దేశం లోకి రానివ్వకుండా చేసి దేశం కోసం అమరుడైన వీర జవాన్ మూడే మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కడప నగరం ఎర్రముక్క పల్లి సర్కిల్‌లో గల సైనిక స్థూపం వద్ద సాయంత్రం 6.30గంటలకు ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్. ఐ. శివా నాయక్ జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్ ఆధ్వర్యంలో కొవత్తుల దీపాలతో మురళి నాయక్ గారికి అశ్రుత నివాళి సమర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని మౌన ప్రదర్శన ర్యాలీ నిర్వహించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డాక్టర్ శివా నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ దాడి చేసినా ఎదురుకోవడానికి భారత సైనికులు సిద్ధంగా వున్నారని, మన సైనికులు ఉగ్రవాదులు ఎక్కడ దాచుకున్నా పాకిస్తాన్ అంతం అయ్యే వరకు పోరాడుతూ వుంటారు అదే విధంగా మన దేశ ప్రధాని గారి ఆదేశానుసారం ఏంతో శక్తి వంతంగా సైనికులు ఎదురుకోవడానికి మన రక్షణ కోసం అశ్రు లు బారిన జవానులందరికి సంతాపం తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణ రెడ్డి, వేణు గోపాల్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి వెంకట స్వామి నాయక్, అర్జున్ నాయక్, బీడీ నాయక్, శ్రీనివాస్ నాయక్, కృష్ణ నాయక్, వెంకట శివా, వేణు గోపాల్, తిరుమలేష్, వర్మ, పవన్ నాయక్, కిరణ్ నాయక్ పాల్గొన్నారు.

మిట్స్ లో విద్యార్థులకు సినీ క్రాఫ్ట్-2025 కార్యక్రమంపై పోటీలు

విశాలాంధ్ర-మదనపల్లె:- మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లి నందు ఫిలిం మేకర్స్ క్లబ్ వారు స్టూడెంట్స్ ఆక్టివిటీ సెంటర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు సినీ క్రాఫ్ట్-2025 కార్యక్రమంపై పోటీలను నిర్వహించినారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఫోటోగ్రఫీ, రీల్స్, స్క్రిప్ట్ రైటింగ్ మరియు యాక్టింగ్ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు తీసిన ఫోటోలను, రీల్స్, షార్ట్ ఫిలిమ్స్ ను ఇందులో ప్రదర్శించారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ కళాశాల లోని ఫిలిం మేకర్స్ క్లబ్ వారు విద్యార్థులలో ఫోటోగ్రఫీ, వీడియో లపై గల నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇది ఒక మంచి అవకాశం అని, ఇది కల్పించిన క్లబ్ వారిని అభినందనలు తెలియజేసారు. ఎన్నో అందమైన అంశాలను మనం కెమెరా లో బంధించడానికి ఒక మంచి అవకాశమే ఫోటోగ్రఫీ అని అన్నారు. వీడియో ద్వారా మరియు ఫోటో కెమెరా ద్వారా మనకు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో విషయాలను మన ముందుకు తీసుకురాగలుగుతునము అంటే టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిందో చెప్పగలం. సోషల్ మీడియా లైన ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ మరియు యూట్యూబ్‌ల ద్వారా ఎంతో మంది ప్రపంచాన్ని మన ముందుకు తీసుకురాగలుగుతున్నారు అని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు కార్యక్రమం లో కళాశాల సాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి హేమంత , ఫిలిం మేకర్స్ క్లబ్ కోఆర్డినేటర్ రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర- మదనపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మదనపల్లె మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్ సచివాలయం పరిధిలో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంత వాసులకు దోమల వ్యాప్తి వల్ల ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమ తెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మురుగినీటి కాలవల్లో నీరు నిల్వ లేకుండా పారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి కి అనుకూలమైన ముళ్ళకంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని వివరించారు. అనంతరం ఆ ప్రాంతంలో లార్వా ఆపరేషన్ చేపట్టి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమల నివారణకు మందులను పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతం ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, ప్రజలు పాల్గొన్నారు.

మే 10, 11వ తేదీలలో మాతృశ్రీ

తరిగొండ వెంగమాంబ 295వ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 295వ జయంతి ఉత్సవాలను మే 10, 11వ తేదీల్లో తిరుపతి, తరిగొండలో వైభవంగా నిర్వహించనున్నారు. తిరుపతిలోమే 10, 11వ తేదీల్లో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 గంటలకు సాహితి సదస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.మే 11వ తేది ఉదయం 9 గంటలకు తిరుపతి ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారు.తరిగొండలో మే 11వ తేది తరిగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, ఆలయ ప్రాంగణంలో శ్రీ తరిగొండ వెంగమాంబకు పుష్పాంజలి, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో గోష్టి గానం, హరికథ నిర్వహిస్తారు.

వైభవంగా కలిచెర్ల మౌలాకా పహాడ్ ఉరుసు గంధం మహోత్సవం

- కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్న నిస్సార్ అహమ్మద్

విశాలాంధ్ర-మదనపల్లె : ఉగ్రమూకలపై భారత సైన్యం చేస్తున్న దాడులలో విజయం సాధించాలని,సైన్యానికి తగినంత బలం ఆత్మస్థైర్యం అల్లాహ్ ఆశీస్సులు వుండాలని మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ కోరుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దమండ్యం మండలం,కలిచర్ల మౌలాకా పహాడ్ ఉరుస్ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.గురువారం రాత్రి మౌలాకా పహాడ్ ఉరుస్ గంధం మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఇందులో భాగంగా కడప పెద్దదర్గా పీఠాధిపతి సయ్యద్ ఆరిఫుల్ల సాహెబ్ హుస్సేనీ ఆశీస్సులు మదనపల్లె వైసిపి ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్ పొందారు.నిస్సార్ అహమ్మద్ కలిచర్ల మౌలాకాపహాడ్ ఉరుస్,గంధం మహోత్సవానికి హాజరై ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు.ఉగ్రవాదంపై భారత త్రివిధ దళాలు చేస్తున్న పోరులో విజయం సాధించాలని (దువ్వ) ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాదర్ సమర్పించి, చదివింపులు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ కలిచర్ల దర్గా ఎంతో చారిత్రకమైందని పేర్కొన్నారు.ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేస్తున్న పోరులో విజయం సాధించాలని కోరుకోవడం జరిగిందన్నారు.ప్రపంచ అభివృద్ధికి వినాశకరిగా మారిన ఉగ్రవాదం అంతం కావాలని,వారికి మద్దతు ఇచ్చేవారు ఎవరైనా ఓటమి ఎదుర్కోక తప్పదన్నారు.దేశ ప్రజలంతా సైన్యానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

నగరంలో 4 ఏళ్ల లో 5వేల మందికి

ఇళ్ల పట్టాలు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : నెల్లూరు నగరంలో రాబోయే 4 ఏళ్ల లో కనీసం 5వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. శుక్రవారం సాయంత్రం భగత్ సింగ్ కాలనీలో పర్యటించిన మంత్రి నారాయణకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అపరిష్కృతంగా ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించిన మంత్రి నారాయణకు బ్రహ్మరథం పట్టి ,పూల వర్షం కురిపించారు. తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ఇంటి పట్టాలకు క్యాబినెట్లో గ్రీన్ సిగ్నల్ ఇప్పించిన మంత్రికి ప్రతి గడపలోనూ మంగళ హారతులతో స్వాగతం పలికారు. భగత్ సింగ్ కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి మంత్రి నారాయణ పట్టాలు ఇస్తున్నామని శుభవార్త చెప్పారు1400 కుటుంబాలలో వెలుగులు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుచేతుల మీదుగా త్వరలోనే భగత్ సింగ్ కాలనీవాసులకు పట్టాలు ఇప్పిస్తానని చెప్పారు. పేదకుటుంబంలో పుట్టిన తనకు చదువుతో పాటు సంస్కారాన్ని తన తల్లితండ్రులు నేర్పారని, పేదల కష్టాలు ,అవసరాలు నాకు తెలుసని మంత్రి నారాయణ అన్నారు. అందుకే వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకొని ముందుకు సాగుతున్నానని చెప్పారు. మంత్రిగా 2014 -19 లో పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలని భావించి, 5200 కోట్లతో నెల్లూరు సిటీని అభివృద్ధి చేశానన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో కాలనీ వాసులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, శాశ్వత పట్టాలు ఇప్పిస్తాని ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు భేషజం లేకుండా పనిచేశానన్నారు.ఇరిగేషన్ ,రెవెన్యూ శాఖలను సమన్వయపరిచి పట్టాలకు మార్గం సుగమం చేశానని, పార్టీలతో పనిలేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ న్యాయం చేస్తానని భగత్ సింగ్ కాలనీవాసులకు మంత్రి భరోసా ఇచ్చారు. భగత్ సింగ్ కాలనీవాసుల సమస్యకు పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హార్సిలీ హిల్స్‌లో

ఎస్.ఆర్ విండ్ వేవ్ హోటల్ సీజ్

విశాలాంధ్ర -మదనపల్లె: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్ కొండపై ఉన్న విఆర్ఎస్ హోటలను శుక్రవారం కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తాసిల్దార్ సీజ్ చేశారు హోటల్ నిర్వాహకులు మురికినీరు గాలి బండ పైకి వదలడంతో దీంతో పర్యాటకులు వాటిపై ఉన్నత అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. అక్కడ దుర్వాసన ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు అక్కడికి వెళ్లలేక పోతున్నామని ఆ మురికి నీరు అదుపు చేయాలని కోరారు. దీంతో గత రెండు నెలల క్రితం మదనపల్లి సబ్ కలెక్టర్ హోటల్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. నోటీసు సైతం హోటల్ నిర్వాహకులు లెక్కచేయకుండా మురికి నీరు అలాగే వదిలేశారు. దీంతో జిల్లా కలెక్టరు శ్రీధర్ చామకూరి హోటల్ సీజ్ చేయాలని ఆదేశాలిచ్చారు. గాలిబండ వద్ద ఉదయం, సాయంత్రం సమయాలలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంటుంది. హార్సిలీ హిల్స్ కు వచ్చే పర్యాటకులు అందరూ తప్పనిసరిగా గాలిబండ వద్దకు వెళ్ళి సహజసిద్ధమైన ప్రకృతి అందాలను, చక్కటి గాలిని ఆస్వాదిస్తూ అక్కడ ఎక్కువ సమయం గడుపుతుంటారు. అయితే గాలి బండకు పైభాగాన ఉన్న వి.ఎస్.ఆర్ విండ్ వేవ్ హోటల్ నుంచి వ్యర్థాలను, డ్రైనేజ్ నీరును బయటకు వదలడంతో అవి గాలిబండ సమీపంలో నిలుస్తున్నాయి. ఈ విషయంలో హోటల్ యాజమాన్యం తీరు మార్చుకోకపోవడం వల్ల అనేక మంది నుంచి వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా వి.ఎస్.ఆర్ విండ్ వేవ్ హోటల్ ను సీజ్ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, తహసిల్దార్ లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.కొండపైన పారిశుద్ధ్య కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

కూలీలకు వసతులు కల్పించండి

విశాలాంధ్ర- వలేటివారి పాలెం: ఉపాధిహామీ కూలీలకు నీరు,నీడ వంటి వసతులు కల్పించాలని కందుకూరు క్లస్టర్ ఏపీడీ బాబారావు ఫీల్డ్ అసిస్టెంట్ లను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బడేవారి పాలెం, అయ్యవారిపల్లి, పోలినేనిచెరువు పంచాయతీ లోని నాగిరెడ్డి పల్లి గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను కందుకూరు క్లస్టర్ ఏపీడీ బాబూరావు పరిశీలించారు. పనిప్రదేశంలో పని చేస్తున్న కూలీల హాజరు పట్టికను పరిశీలించారు.పనులు జరుగుతున్న తీరును గురించి కూలీలను అడిగి తెలుసుకొని కూలీలకు తగు సూచనలు చేశారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకం పై ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టెక్నీకల్ అసిస్టెంట్ లు గడ్డం నాగార్జున, కొండలరావు, ఫీల్డ్ అసిస్టెంట్ లునారాయణ,మాలకొండ్రాయుడు ఉన్నారు.

నేటి నుండి సెమీఫైనల్ మ్యాచులు

విశాలాంధ్ర-సుండుపల్లె: నేటి నుండి సుండుపల్లె ఎంకెఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సెమీ ఫైనల్ మ్యాచులు జరుగుతాయని శుక్రవారం ఆర్గనైజర్లు జయరాం, వెంకటేష్‌లు తెలిపారు. గత పది రోజుల నుండి ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్గీయ మిన్నమరెడ్డి శివారెడ్డి జ్ఞాపకార్థం జరుగుతున్న టోర్నమెంట్ సెమీ ఫైనల్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి టోర్నమెంట్ లో మూడు మ్యాచ్లు వరుసగా గెలిచిన చెల్లు సూపర్ కింగ్స్ జట్టు, సచివాలయం (సచివాలయ ఉద్యోగులు) జట్లులు మొదటి సెమి ఫైనల్లో తలపడనున్నట్లు తెలిపారు. అలాగే టోర్నమెంటులో వరుసగా రెండు విజయాలు సాధించిన కె.కె జట్టు, గబ్బర్‌సింగ్ (వడ్డీపల్లె) జెట్లు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తలపడనున్నట్లు తెలిపారు. ఈనెల 13న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని తెలియపరిచారు. క్రీడాకారులు, అభిమానులు వీక్షించేందుకు రావాలని కోరారు.

నగరానికి దూరంగా పందుల పెంపకం చేపట్టాలి

- మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల: నగర ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని యర్రగుంట్ల నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పందుల పెంపకదారులతో శుక్రవారం ఆయన మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కమిషనర్ మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో పందుల పెంపకం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రజల నివాసాల మధ్య పందుల పెంపకం వలన కలిగే అపకారాలు, దుర్వాసన, వ్యాధుల వ్యాప్తి వంటి అంశాలపై పందుల పెంపకదారులకు వివరించారు. వీలైతే పందుల పెంపకదారులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రత్యేక సమీక్షా సమావేశంలో సీఐ పి.సురేష్ బాబు, తహసీల్దార్ కె.శోభన్ బాబు, వెటర్నరీ డాక్టర్ బి. మునెయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వీర జవాను మురళి నాయక్‌కి అశ్రునివాళి

విశాలాంధ్ర-పులివెందుల: దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను ఎదురొడ్డి వీరమరణం పొందిన జవాను మురళీనాయక్‌కు వైసిపి పట్టణ కన్వీనరు హాలు గంగాధర్‌రెడ్డి అశ్రు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమరణం పొందిన మురళి నాయక్ త్యాగాన్ని మరువలేనిదన్నారు. మురళి నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ఆయన చూ పిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వ కార ణమన్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన జ వాను మురళి నాయక్ యుద్ధభూమిలో ప్రాణాలు కోల్పోయిన వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. దేశం కోసం మురళి నాయక్ వీర మరణం పొందారని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, మురళి నాయక్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉండాలని గంగాధర్‌రెడ్డి కోరారు.

ఎర్రగుంట్ల మండలానికి 7టన్నుల పశువుల దాణా

- 50శాతం రాయితీపై పంపిణీ
- కిలో రూ.11.10కే అందజేత
- రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల ద్వారా పంపిణీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండలంలోని పశుపోషకులకు 50శాతం రాయితీపై సమీకృత దాణా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.22.11కు కొని రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల ద్వారా పశుపోషకులకు రూ.11.10కే పంపిణీ చేయాలని నిర్ణయించారు. 20శాతం ప్రొటీన్ కలిగిన ఈ దాణాను ప్రభుత్వం తొలిసారి అందజేస్తోంది. తెల్లరేషన్‌కార్డు కలిగిన పశుపోషకులు ఈ లబ్ధి పొందేందుకు అర్హులు. ఒక్కో కుటుంబానికి 90రోజులు (విడతల వారీగా) 450కిలోల దాణాను రాయితీపై పంపిణీ చేస్తారు. ఎర్రగుంట్ల ప్రాంతంలో ప్రస్తుతం ఒక రైతుకు 50కిలోల బస్తా అందజేస్తున్నారు. ఎర్రగుంట్ల మండలానికి కామధేను పశువుల దాణా నిర్వాహకులు 7 టన్నుల దాణాను సమకూర్చారు. వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించి నిలకడగా పాడి ఉత్పత్తులు పొందేందుకు, పశువుల విక్రయాలను నిలువరించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-బద్వేలు: సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు కారణంగా నేడు ఉదయం 8.00ల నుండి 12.30గం.ల వరకు సబ్‌స్టేషన్ లో బద్వేలు, గోపవరం, అట్లూరు బి.మఠం మండలాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళ్ళాయప్ప తెలియచేశారు. వినియోగదారులు సహకరించ వలసినదిగా కోరడమైనది.

పి4 విధానంతో జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధి: ఎమ్మెల్యే ఆది

విశాలాంధ్ర-జమ్మలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పి4 విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని జమ్మలమడుగు మున్సిపాలిటీని అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని నగర పంచా యతీ కౌన్సిల్ హాల్ నందు జమ్మలమడుగు నగర పంచాయతీ సాధారణ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినా రాయణ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి కేవలం11 నెలలు అయినప్పటికీ జమ్మలమడుగులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధిని గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఒకేసారి 160 పనులు చేసేందుకు కౌన్సిల్ నందు ప్రతిపాదనలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. విద్యుత్, రోడ్లు, మురుగు కాలువలు, త్రాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు మొదట ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మూడు నెలల్లోపు టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంగ దొడ్డి సింగరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల నుండి సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం అందించడం లేదని ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు ముల్లా జానీ, ముని సుబ్బారెడ్డి, శివలింగారెడ్డి, కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-చెన్నూరు: మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, లైన్లు మరమ్మత్తులకు గాను చెన్నూరు మండల వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

యస్‌యస్‌సి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వసంత గృహ అధికారిని రాష్ట్ర ప్రభుత్వం సన్మానం

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్, వసతి గృహంలో 2024,2025 సంవత్సరంలో ప్రభుత్వ వసతి గృహంలో చదివిన విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు 584 సాధించిన విద్యార్థిని వెంకట సిద్ధార్థ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయులు చేతుల మీదుగా విద్యార్థిని సన్మానించి ప్రభుత్వ గృహ సంరక్షకుడు మునియ్యను కూడా సన్మానించారు విజయవాడ తుమ్మలపల్లె కళక్షేత్రం మైదానంలో సన్మానించి సాలవ పూల మాలలతో మెనూటల్ ప్రశ్నోత్త పత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఉచిత విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు వసతి గృహంలో మెనూ భోజనాలు అందించడంతో ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నిధులు కేటాయించి విద్యార్థులు చదవాలని ఆకాంక్షతోనే ముందుకు పోతుందని ఆయన తెలిపారు విద్యార్థులు మంచిగా చదువుకొని మంచి మార్కులతో క్రమశిక్షణతో మెదగాలని అధికారులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులు కడప జిల్లా సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి సరస్వతి కూడా అభినందించి పూలమాలలు సాలువుతారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మేడసానికి వినతి

- పోతుగుంట రమేష్ నాయుడు

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామానికి టీటీడీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి తాళ్లపాక అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం తాళ్లపాక గ్రామానికి విచ్చేసిన అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మేడసాని మోహన్ కు బిజెపి రాష్ట్ర నాయకులు పోతు గుంట రమేష్ నాయుడు ,నాగోతు రమేష్ నాయుడు, తాళ్లపాక గ్రామ మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య కుమారుడు ఉద్దండం సుబ్రహ్మణ్యం, న్యాయవాది సురేష్ రాజుల తో పాటు గ్రామస్తులు అద్భుతదీపుడు జవాజి మోహన్ రావు లు విడివిడిగా వినతి పత్రాలను అందజేసి తాళ్లపాక అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. ముఖ్యంగా తాళ్లపాక ముఖ ద్వారం నుంచి తాళ్లపాక గ్రామం వరకు రెండు వరుసల రహదారిని ఏర్పాటు చేసి, కవులకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేయాలని, తాళ్లపాక మొదటి చెరువులో అన్నమయ్య కూర్చుని తాళ్లపత్ర గ్రంధాలపై అన్నమయ్య కీర్తనలు రాసే విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి చెరువును తీర్చిదిద్దాలని, తాళ్లపాకలో మూతబడిన ప్రసాద కౌంటర్ తో పాటు సుదర్శన్ కౌంటర్ ను పునరుద్ధరించి, మ్యూజియం ఏర్పాటు చేసి సంగీత నృత్య కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. తాళ్లపాకకు విచ్చేసే భక్తులకు కళాకారులకు మౌలిక వత్తులు కల్పించాలని, మైకులు ఏర్పాటు చేసి నిత్యం అన్నమయ్య సంకీర్తనలను ప్రసారం చేయాలని,తాళ్లపాక పాఠశాలలో గతంలో మాదిరిగా ఒక సంగీత ఉపాధ్యాయుడిని నియమించి అన్నమయ్య లను తీర్చిదిద్దాలని వారు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అన్నమయ్య జయంతి వర్ధంతి మహోత్సవాలపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు, ఉత్సవాలలో స్థానిక ప్రజా ప్రతినిధులను, స్థానికంగా ఉన్నటువంటి అన్ని శాఖల అధికారులను భాగస్వాములు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా తాళ్లపాక ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులను, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. ఇందుకు మేడ సాని మోహన్ సానుకూలంగా స్పందించి మరొకసారి అన్ని శాఖల అధికారులతో ఇక్కడికి విచ్చేసి తాళ్లపాకలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రత్యేక అంచనాలు తయారు చేస్తామని హామీ ఇచ్చారు. మేడ సాని తాళ్లపాకు విచ్చేసిన సమయంలో అటు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద వాచ్ మెన్ లేకపోవడం, తాళ్లపాక ఆలయాల ఇన్స్పెక్టర్ కూడా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బంది ఎవరని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ఇన్స్పెక్టర్ గ్రామస్తులతో సమన్వయంగా పనిచేయడం లేదని ఆయనను వెంటనే బదిలీ చేసి మరొక అధికారిని ఇక్కడికి నియమించాలని విన్నవించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉద్యోగావకాశం

విశాలాంధ్ర-రాయచోటి: శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్, ఫ్యాక్స్ కాన్, ఇరా ఆటో మోషన్ సంస్థల ప్రతినిధులు వరుసగా చిట్టిరాజ్, గంగూల్ రెడ్డి, రేష్మ, డాక్టర్ సుబ్రమణ్యం, చందన హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 156మంది విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ఫ్యాక్స్ కాన్ సంస్థ 75మందిని, అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్ 16మందిని, ఇరా ఆటో మోషన్ 12మందిని ఎంపిక చేసుకున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.4 లక్షల నుండి రూ.3 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థుల ఉద్యోగ అవకాశాల మెరుగుదల కోసం మొదటి సంవత్సరం నుంచే లాజికల్, అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, విభాగాధిపతులు అభినందించారు.